అత్తకుతగ్గకోడలు

శ్రీమతి లీలావతిగారు

౧

చేన్లుగారంటే శంభాంలో చాలాప్రఖ్యాతి. శంభాంఏమిటి,-'ఆంధ్రదేశంలో యింతటివాడులేడ'ని చేన్లుగారిపేరుచెప్పని మనిషిలేడు. పెద్దఘనాపాటి. పెద్దపెద్దశాస్త్రుళ్ళవారు, కుండనాలవారు, అవధాన్లవారు చేన్లుగారంటే చేతులుజోడించేవారు. ఇక, పంతులుగారు పదిగంటలకుఆబ్దికం తెమల్చాలంటే, సంకల్పంఆరంభించి, 'మమ' అనుకోకుని, అగ్నిహోత్రాదిమంత్రాలలోని కొసామొదలు ముక్కలేకరవుపెట్టి,క్రియాభోగంసమయానుకూలంగామార్చే మహనీయులు; 'ఆత్మప్రదక్షిణనమస్కారాన్ సమర్పయామి, ధూప, దీప, నైవేద్యార్థం అక్షతాన్ సమర్పయామి' యనికల్పించి పూజావిధానం పాడుచేసేపండితులు చేన్లుగారంటే చెమట్లుకార్చుకునేవారు. 'యిల్లా'లని పిలిచేవారు చేన్లుగారు భార్యను. ఆనిష్ఠ, ఆమడి, ఆతడి-కేవలం చేన్లుగారికితగిన అర్థాంగిఅనిపించుకున్నదాయిల్లాలు. చేన్లుగారిసంతానంమాటో? పుత్రికాసంతానంలేకపోయినా యిద్దరు పుత్రులు మాత్రంపుట్టేరు - అయిదేళ్ళుఎచ్చుతగ్గులో- అంతే. పెద్దబ్బాయిని తనంతటివాణ్ణిచేద్దామని వేదంలోప్రవేశపెట్టేరు. కాలాన్నిఅనుసరించి ఆంగ్లభాషఅంటే అదేమిటో ఘనతఅనుకొని, అందులో ప్రవేశపెట్టేరు- చిన్నబ్బాయిని. చిన్నప్పుడేమిపేర్లుపెట్టిరోకాని, 'పెద్దా! చిన్నా!' అని పిలిచేవాడుక-చేన్లుగారిఅబ్బాయిల్ని. ప్రాయం ముదురుతుంటే, 'ఆరెండు కార్యాలు మనచేత్తోటేచేద్దామని వుద్దేశంవుంటుంది కదా ముసలివాళ్ళకి. చేన్లుగారుకూడా ఆపద్ధతిలోనే పూర్వాచారాన్నిఅనుసరించే, తనకొడుకులిద్దరికీ కార్యాలుచేసేరు. పెద్దకోడలు భ్రమరం కిండాం కుండనాలశాస్త్రులవారికూతురు. చిన్నకోడలు ముత్తు పాలకొండ పంతులుగారిఅమ్మాయి.

అంతా బాగానేవుంది. మర్యాదో? అంతా నెత్తినిపెట్టుకునేవారు. సంపత్తా?-ఇద్దరుకొడుకులున్నారు మాణిక్యాలలాగ. పెళ్ళిళ్ళుగూడాఅయేయి. కాని ఒక్కటేకొదవ. తానైతేనేమి, పిల్లలైతేనేమి-ఇంటిదగ్గర భోజనంచెయ్యకూడదు. అదీ యిల్లాలుగారిఅభిప్రాయం. దేశదేశాలు తిరిగి ఆర్జించినసొమ్మంతా ఇంట్లోపడవెయ్యడమే చేన్లుగారిపంతు. ఆతెలుపు నాణ్యాన్ని పచ్చగామార్చి శరీరంమీద దాచుకోవడం యిల్లాలుపని. ఇలాగ ఆయిల్లాలుజెండా మహావైభవంగా ఎగురుతోంది. చేన్లుగారికి యిదోకష్టంగా తోచలేదుకూడాను. తనపెద్దబ్బాయిని వెంటవేసుకుని దేశసంచారమే అలవాటైంది-అదే 'హాయి' అనిపించింది. చిన్నబ్బాయికిమాత్రం చింతాకుపచ్చడీ, అన్నం-ఆయిల్లాలుతోపాటు-ఆంగ్లం చదవడంచేత అడుగుకదల్పడానికివీలులేక; నౌఖరీగట్రావుంటేనా? కాలచక్రం తిరిగిపోతుంది.

౨

ఇంతట్లో భ్రమరం పెద్దమనిషిఅయినట్టుకబురు. శాస్త్రోక్తంగా చేన్లుగారు కిండాంలోనే శుభకార్యం జరిపించేరు. అట్టేవ్యవధిలేకుండా అబ్బాయికంటే ముందు అత్తగారే కోడల్ని కాపరానికితీసుకువచ్చేరు. అప్పటినుండి పెద్దబ్బాయి యింటిపద్దవుండవల్సివచ్చింది-అపుడపుడు దేశాంతరంవెళ్ళినా. కొత్తలో సవ్యంగానేవెళ్ళింది-కొన్నాళ్ళు. అత్తగారికి బద్ధకంపుట్టింది. ఘనంతాకోడల్దే. వయస్సులో వున్నపిల్లా-ఆభోజనం సరిపడేదికాదు. క్రమంగా వ్యాపారంముదిరింది. 'కోడలుచేసేపనులకి కడాకూ తప్పులే' అనేమాట నిజమైంది. ఆపోటీలు-కొడుకుచేతకొట్టించడం-ఆఖరుకి అత్తగారే చేయిచేసుకోవడం అలవాటులోకిదిగింది.

*　　*　　*　　*

ఆఘాడు అట్లతద్ది. అత్తగారు అపతలవున్నారు. చేన్లుగారు, అబ్బాయిలు చేనులోకివెళ్ళేరు. కోడలుకి చిన్నకోరికపుట్టింది-అట్లు చేసుకుతిందామని. రహస్యంగా పనిసాగించడానికి ప్రారంభించింది భ్రమరం. అట్లుపోస్తున్నట్లు ఆకట్టేరుఅత్తగారు. దారాలు తీసేరు. కూపీ పైకిలాగేరు. ముట్టుకోడానికి వీలులేక

గాని, కొట్టినంతపనిచేసేరు. ఇటేడు, అటేడుతరాల వార్ని సాగతీసి చమకపారాయణచేసేరు. భ్రమరం ధుమధుమలాడుతూ లోపలికినడిచింది. పెరడులో పెద్దశబ్దంచేసింది.

మట్టమధ్యాహ్నం. చేన్లుగారువగైరా చేరుకున్నారు. పొద్దెక్కినందుకు మహావేగంతో నూతిదగ్గరకువెళ్ళేరు—స్నానంచేయడానికి చేన్లుగారు. పరాకుగా చేదనూతిలోదింపేరు. చేదకు ఏవోతగిలింది. తొంగిచూచేరు. 'శవమ్రో!' అన్నారుధాటీగా. నలుగురుమూగేరు. 'ఎవరిదీ?' 'భ్రమరం! భ్రమరం!!' 'ఏందారి?'...'అత్తగారిప్రభావం'అనుకున్నారు అంతాను. క్షణంలో పోలీసువారుప్రత్యక్షం. చేన్లుగారి గుండెలుచెదరేయి. గబగబలు-లబలబలు-గుసగుసలు-ఆఖరుకి నూతులోపడడానికికారణం: బలవంతం కాదనీ, ఆపెకు మూర్ఛజబ్బువుందనీ, నీళ్ళుతోడుతుండగా ఆజబ్బువచ్చిందనీ, ఏవోవ్రాసుకుని (పదిరాళ్ళు తడుముకొని) పైకిసాగేరు పోలీసువారు.

3

సందట్లోసందడి. ముత్తుకూడా రజస్వలాఅయినట్లు కబురు. రివాజు ప్రకారం చేన్లుగారు పాలకొండ వెళ్ళేరు—కార్యంచెయ్యడానికి. (కుటుంబంతోటే) ఆమూడురాత్రిళ్ళుగడచేయి. కోడల్ని పంపమన్నారు. సారెఅయినవెంటనే కోడల్నిపంపడం ఆనవాయితీ కాదని, ఆతర్వాత అత్తారుపిలిచినపుడుపంపడం వారికి ఆచారమనీఅన్నారు పంతులుగారు. చేన్లుగారు ధర్మానికి కట్టుబడ్డారు—యిల్లాలికి యిష్టంలేకపోయినా.

* * * *

భ్రమరం హఠాత్తుగామరణించడాన్కి కారణాలు మెల్లిమెల్లిగా పంతులుగారిచెవిలోపడ్డాయి. క్రమక్రమంగా ముత్తుని కాపరానికిపంపమని వుత్తరంమీద వుత్తరం వస్తున్నాయి. ఇక్కడపచ్చిందిచిక్కు. ఇల్లాలు గుణాలుచూస్తేభయం. కూతుర్ని కడకాలం ఆపె చేతిలో పడవెయ్యాలి. పంతులుగారూ భార్యా బాగావిమర్శించేరు. ఏది ఎలాగయినాసరే, ముత్తుని ఆయిల్లాలుబ్రతికివుండగా పంపదలుచుకోలేదు. ఏవుత్తరానికీ జబాబుకూడా వెయ్యలేదు. ముత్తుకిమాత్రం యిబ్బందిగావుండేది.

* * * *

ఒకనాడు అల్లుడేఅవతరించేడు అత్తారింట. జరగవలిసినమర్యాద లన్నీ జరిగేయి. మధ్యాహ్నం మూడు గంటలకి తీరుబడిగా అల్లుడు వుపక్రమించేడు—పిల్లని పంపమంటూ.

పంతులుగారిలాప్రారంభించేరు.—

'ఇదుగో! నేనొక్కటిచెబుతానువిను. నువ్వేదో చదువుకున్నావు. నౌఖరీప్రయత్నంచేసుకో. ఎక్కడైనావుద్యోగంఅయితే అక్కడ హాయిగా మీరిద్దరూ వుండవచ్చును. కావలిస్తే అందాకా యిక్కడేవుండు. ఇక, మాయింటికి.........'

అని ఇంకాఏమిటోచెబుతుండగా, 'అయ్యో! అయ్యో! మీమాటలే మావండి! రండీ! రండీ!!' అనే కేకలు వినబడ్డాయి. ఇద్దరూపరుగెత్తేరు యింట్లోకి. 'ఏం? ఏంవచ్చిందేమిటి?' అన్నారు పంతులుగారు. 'అమ్మాయికి తేలుకరిచింది. మంత్రం—అబ్బా ఎక్కడమ్మా! గుడ్డకట్టనా? అయ్యో! మందు!' అని కంగారు.

'ఉండమ్మా! డాక్టరునితీసుకువస్తాను.'

'నాన్నా! నువ్వుండు' అందిముత్తు కళ్ళుతెరవేసి.

'నేవెళతానండి, అయ్యారుగారేకదూ! నాకు తెలసును' అంటూ పరుగెత్తేడు అల్లుడు.

అల్లుడు అవతలకి వెళ్ళగానే ముత్తుబాధంతాపోయింది. 'మీకేమీతెలియదుసుమండీ! ఆఅబ్బాయితో వాళ్ళింటిభోగట్టా ఎందుకుఎత్తబోయేరు? అయినా ఆడపిల్లనికనుక్కున్నవాళ్ళం, మనకి మంకు పట్టుకూడునా? అడగ్గానే పంపకపోతే అతడేమి అనుకుంటాడో? నాకునచ్చదుసుమండీ!' అన్నాది అతని భార్య. 'నాన్నా! నాభాగ్యానికి ఎవరుకర్తలు? నా వంటివాళ్ళెందరి కిలాంటిఅత్తలున్నారో? నాలో వుందిఅంతాను' అందిముత్తు ముద్దుగా. 'అయితే మీ యిష్టం. అయినా జాగ్రత్తసుమా!' అన్నాడుఅతను.

ఇంతలో అయ్యారుగారూ అల్లుడూ చేరుకున్నారు.

'పాపం! కంగారులో మీకు శ్రమయిచ్చేం. యీ ప్రక్కాయన మంత్రంవేసేడు. బాధతగ్గింది. క్షమించాలి.'

'మనకుకావలసింది అదేకదండీ! అయినా పథ్యంగా వుంచండి' అంటూ, 'ఏమోయ్! తెలిసిందా?' అన్నారు అయ్యరుగారు—అల్లుడువైపుచూసి.

'చిత్తం! చిత్తం!' అంటూ అయ్యరుగార్ని అవతలకుసాగనంపి అంతా ఇంట్లోకిచేరుకున్నారు.

* * * *

మర్నాడు. 'అయితే, ఏమిటిఆలోచించేరు?' అన్నాడు అల్లుడు.

'నీయిష్టం. మేంచెప్పవల్సినమాటచెప్పేం.'

అల్లుడు ఆలోచించి 'తప్పదు.'

'అయితేసరే.'

'రేపు మంచిరోజట!'

'అలాగేకానీ నాయనా!'

* * * *

ఆమర్నాడు బండి వాకట్లోనిలబడింది. జరగవలసినలాంఛనాలన్నీజరిగేయి. తల్లితోపాటు తండ్రికూడా కంటతడిబెట్టేడు. వీళ్ళనిచూచి ముత్తుకూడా రెండునీళ్ళచుక్కలుకార్చుతూ బండిఎక్కింది. బండి ఆవీథిదాటిందాకా దిగబెట్టి, 'జాగ్రత్తసుమా!'అంటూ ఇంటివైపుమళ్లేరు ఆదంపతులు.

* * * *

'క్రొత్తప్రియం, వేడిరుచి' అంటారుపెద్దలు. ముత్తుకూడా అత్తారికిక్రొత్తే. అందుకుతగ్గట్టుగా ప్రవర్తించేదికూడాను. పైగా పట్టవాసంపిల్ల. నవనాగరికతగలనారి. చేన్నగారికి, యిల్లాలుకి, అన్నదమ్ములిద్దరికీ అనవచాకిరీచేసేది. అందులోనూ అత్తగారిమెప్పుపొందుదామని ప్రయత్నం. తనతోటికోడలుకీ అత్తగారికీ ఎక్కడపడేదికాదో అవన్నీ తప్పించుకునేది. ఇలా కాలక్షేపంచేయడంమొదలుపెట్టింది ముత్తు—తప్పుకి సందులేకుండా.

భ్రమరానికి యిల్లాలే అత్తగారైందికాని, ముత్తుకి ఊరల్లా అత్తగార్లే—ఆక్షేపించడంలో. అసలుపల్లెవారు. ఆరుమూళ్ళముతుకపంచ ముణుకుమోకాళ్ళు దిగకుండ కచ్చకట్టి, ప్రతీరోజూస్నానంచేసి, పట్టెడు పసుపుకుంకంపెట్టుకునేముత్తయిదువలకు, పాదంములిగిందాకాకట్టే ఆగూడారుకచ్చా, ఆసబ్బురుద్దుకోవడం—ఆవంకపాపిడా—వ్యగ్రతగకనుపించేది. అందరూ ఆక్షేపించేవారు. అందరితోపాటు అత్తగారు కూడాను. ఆఆక్షేపణే అసూయలోకిదిగింది.

* * * *

కొంతకాలమయినపిదప.

'ఈసాయంత్రం నువ్వూ మాఅమ్మా వాదించుకున్నారట! ఏం?'

'మీఅమ్మచెప్పివుంటారు.'

'నీవు చెప్పకూడదా?'

'నేచెప్పేదేమిటి. ఆవిడచెప్పిందల్లా లేదనడమే కదూ!'

'మనసిచ్చిమాట్లాడవుసుమా!'

'అవును. అందుకేమావాళ్ళు పంపదలచుకోకపోయినా, 'తేలు' అని వేషంవేసి, పంపమనిపట్టుపట్టేను. మొగవాళ్ళకి మాటనిలకడలేదంటారు—యిందుకే.'

'అసలు ఏంజరిగిందోచెప్పవేం' అన్నాడు చిన్నబ్బాయి చికాకుతో.

'అసలేంవుంది? ధాన్యపుగింజలో బియ్యపుగింజ. నిన్నసాయంత్రం చెయ్యిజిడ్డయిందని సబ్బేసికడుక్కున్నాను. అదుగో! అదీ నావల్లవచ్చినఅపరాధం. అందుకు అరనైఆరు వర్ణించుకున్నారు.'

'నువ్వేంటిఅన్నావు.'

'మీసొమ్మేంపెట్టలేదుగద!' అన్నాను.

'ఊరుకోకూడదూ!'

'బాగుందండిమీవరస. అయినదానికీ కానిదానికీ ఆడిపోస్తుంటే, ఎలావూరుకోడం? అక్కడికీ వోర్చేవున్నాను. మావాళ్ళనిఅంటే దుఃఖంఆపుకోలేక, వాళ్ళవూసుఎత్తవద్దన్నాను. అయినా, మీరేంకొన్నారా? చేశారా? నేను కాపరానికివచ్చినదగ్గర నుండీ ఒక్కచిల్లిగవ్వ నాగురుంచి మీరుఖర్చుపెట్టలేదు. బట్టలు మావాళ్ళేకొంటున్నారు నాకూమీకూ కూడాను.'

'కొన్నాళ్ళు నిన్నుకాదనుకొని ఆగకూడనా?'

'చాల్లెండి! మెమ్మెఅంటే జోజోఅన్నట్టుగవుంది. ఏదోకాస్త వుద్యోగంసంపాదించకూడదా! హాయిగా బ్రతుకుదాం-రవ్వారట్టులేకుండా.'

'పిచ్చిదానా! నేనేంవూరుకున్నానా? ఆప్రయత్నంలోనేవున్నాను. వుద్యోగం ధరఖాస్తులకి దస్తా కాగితాలు తగలేసేను. కాళీవున్నాదన్నచోటల్లా ఒక్కొక్క కాగితం జారవిడిచేను. బానిసత్వంకోసం పడరానిపాట్లుపడుతున్నాను. ఈజిల్లాలో నేను చూడని అధికారిలేడు. అయితేనేం, నిండా బి.ఏలు, సంగోరుబియ్యేలు, పదిరూపాయీల నౌఖరీకోసం ప్రాకులాడేరోజుల్లో, పాతికమంది దన్నుండి మహాపురుషులు ప్రయత్నాలుచేస్తుండేరోజుల్లో, వందలకు వందలు పాదపూజలు చెల్లించే యీవిమంతులున్నరోజుల్లో, నాకు వుద్యోగంయిచ్చేవారుఎవరు? అయినా ప్రయత్నాలుమానలేదు. కాలంకర్మంకూడి రావాలి. అందాకా పౌరుషాన్నిచంపుకో.'

'కాని, పోటుకుమాటలుఅంటే వూరుకోలేను సుమండీ! మీకుకోపంవస్తే రానీండికాని.'

'నాకు కోపమేమిటి?'

'అయితే ఆవూసుఎత్తకండి.'

'ఏమోమీయిష్టం.'

'అలా పరస్పరంగావూరుకోండి.'

'మాటతెచ్చేవంటేచూడు.'

'అలాఅన్నారు బాగుంది.'

*   *   *   *

మరికొన్నాళ్ళకి. తొలిజాముదాటి మలిజాముప్రవేశించింది. చేన్లుగారూ పెద్దబ్బాయీ వూళ్ళోలేరు. చిన్నబ్బాయిభోంచేసి వీథిలోకివెళ్ళేడు. ఆనాడు అత్తగారిదేవంట. కోడలువంట్లో నుస్తిగావుంది. అత్తాకోడళ్ళిద్దరికీవడ్డించి, 'రా! అమ్మా! వడ్డించేను' అన్నారు అత్తగారు.

కోడలురావడం ఆలస్యమైంది.

'ఎక్కడాచూడలేదమ్మా! యీసూకరాలు! మేమంతాకనలేదా. వేగుళ్ళట.ఆది వుమ్మడంకాదు. నేంచెయ్యలేనమ్మా. ఎవరిమెప్పుబళ్ళోగాని' అని సణుగుతూ అత్తగారు భోజనానికికూరుచున్నారు.

'మిమ్మల్నిఎవరు చెయ్యమన్నారు. నావడ్డన నేనుచేసుకుంటానులెండి. చేసినన్నాళ్ళు చేయించుకునేవారేగాని మెచ్చేవాళ్ళేరీ? ఒక్కనాడుచెయ్యకపోతే అనేవాళ్ళేగాని' అంటూ ప్రవేశించిందిముత్తు.

'ఇదంతా నీవుచేసిపడిపోయిందే.'

'నేనుకాదు మీరే. అంటే తప్పేతుందేమిటి-అవుసరంపడ్డాక.'

'నోటికివచ్చినట్లుప్రేలక, కుక్కినపేనులా భోంచెయ్యి!'

'నావంట్లోబాగులేదు......నన్ననవద్దు.'

'మాటకుమాటం ఎదురుచెబితే వళ్ళుమండుకువస్తుందిసుమా! జాగ్రత్త!' అన్నారు అత్తగారు.

'అనవుసరంగాఅంటే నాకు తలరిమ్మ' అందిముత్తు.

శ్రుతిమించింది. రాగానపడవలిసిందేకాని, ముత్తుకి కడుపులోత్రిప్పినట్లయింది. వమనమవుతుందేమోఅనుకొని పెరటిలోకివెళ్ళింది. లాభించలేదు. తలత్రిప్పూ, వళ్ళుత్రిప్పూ, తలనొప్పీ-ఎక్కువయేయి. నిలబడ్డం కష్టంగా కనుపించింది. చెయ్యినోరుకడుగుకొని జోగుకుంటూ గదిలోకినడిచింది.

'ఏం! ఎక్కడికేమిటి?'

'తలనొప్పి......'

'అంట్లూయెంగిళ్ళో?'

మరి వినిపించుకోలేదుముత్తు. మంచం సమీపించింది. అత్తగారికి ఆగ్రహంఎక్కువైంది. వెంబడించేరు. 'నాకుతెలుసును-ఆతలనొప్పి ఆవేషాలునాదగ్గిర పనికిరావు-ఎవడుచేస్తాడనుకున్నావు-యీచాకిరీ-నీ అబ్బ!' అన్నారు అత్తగారు.

'అబ్బ' అనేసరికల్లా ఎక్కడలేనిపౌరుషంవచ్చింది ముత్తుకి. నాలుగడుగులు ముందుకివచ్చింది-ఆరోషంలో. ఏమీఅనలేక వికారంగానవ్వింది. ఆనవ్వుతో అత్తగారిశరీరం విడిపోయింది. చటాలున మీదికి వచ్చేరు పళ్ళుకొరుకుతూ-చెయిచేసుకుందామనే. ముత్తుకి ముచ్చెమటలుపోసేయి. శరీరంవడికిపోయింది కోపంచేత.

ఒక్కక్షణం. ఎత్తినఅత్తగారిచెయ్యి దిగుతూంది. రెప్పపాటుకాలం...తలుపుమూల చీపురుకట్టచూసింది ముత్తు. సంగ్రహించింది. 'ఊరుకుంటున్నకొద్దీ...' అంటూ రెండుతగలనిచ్చింది.

'అయ్యో! నీసాహసంకూల!'
మఱ్రెండు...
'అబ్బా! చచ్చేను!'
వకటిమీదవకటి.
'నిన్నేమననే! ప్రాణాలతోవిడిచిపెట్టేతల్లీ!'
జోరుతగ్గలేదు–వర్షం.

*　　*　　*　　*

ముత్తుని అత్తగారుకొడుతున్నారని భ్రమపడి యిరుగుపొరుగులవారంతా చేరుకున్నారు. అంతా రావడంచూసిందిముత్తు. చేతిలోచీపురు జారవిడిచింది. వెఱ్ఱివెఱ్ఱిచూపులు చూస్తూ, జాపోస్తూ 'అయ్యో! అబ్బా!' అంటూ మూలగడంప్రారంభించింది. నోరూరుకోబట్టక పదిమందీ పదివిధాల అత్తగార్ని ఆడిపోసేరు.

'ఆకోడల్ని అలాగేచేసేవు; నెలతప్పివుందాయెను, కోపంకోపంలావుండాలిగాని, అంతచేటుకొట్టడమా! నువ్వేమిటిసహాఅనుకోగాని, బాగులేదుసుమా!' అన్నాదొకావిడ.

'అయ్యో! అయ్యో! మీగోలెనఱ్రామీది. అదే నన్నుకొట్టిందఱ్రా! చూడఱ్రాయీదెబ్బలు! వీపు తట్లు తేరింది!' అంటూ అత్తగారిగోల.

'ఓవిడా! వేషాలుసుమా! ఆబిడ శరీరంముడుతలు తేరివుంటుంది–ముసలిదిఅవడంచేత–ఏం సంగనాచమ్మా!'

'చాల్లేవో! మామ్మోలంటావు! నేనెరగనా? అదేమిటి చీపురుదెబ్బలుకనబడుతుంటేను...రద్దూపోదాం.'

'కాని, నామనసుకునచ్చినపనిచేసింది...భేష్...అత్తకుతగ్గకోడలు.'

కర్లపాలెం కృష్ణరావుగారు

వీరనారి

"లంచమిచ్చెదననెడి యీవంచనేల?
ధనధనేతరమందిరోద్యానవనము
లతిమనోహరచీనిచీనాంబరములు
విలువమణులాదినగలును వేనవేలు
కొల్లలుగనుండె తమదయన్ కొల్లనిండ
కోరికొక్కటె, ఫలముచేకూర్చుటొకటె,
దానసంతృప్తినాకెట్లు గానబడును?
తావకమనోజ్ఞపదపద్మదాసురాలి
ముద్దుదీర్పుము, వేవేగ, మోహనాంగ!
శూరజనకంఠనిర్గతశోణితమ్ము
వరదలుగబారు భీభత్సవాటియందు,
ఘోరరాక్షసమూక, గగ్గోలుజేయ
కుటిలయాకారముల జుట్టుకొనుచుమిమ్ము
బలిమిబడవేయవచ్చెడి బాహుబలుడు,
ధూర్త, దుర్వార, దుస్తంత్రదుర్జనుండు,
నరకుడేగతినుండునో? మఱియు, దివ్య
ప్రవిమలలలితతేజప్రభావపూర్ణ
వదనులగు, మీరలేరీతి, కదనసీమ
ప్రళయకాలయమునిభాతి, పరునెదిరి, వ
క్షమ్ముజీల్ప శూరులై సమక్షముననిల్చి
రణమొనర్తురో? గాంచయారాటపడుచు
వేచుదాననుదీననై వివిధగతుల.
అబలలగునాడువారేడ? హాహాకార
బంధురంబగురణరంగప్రాంతములను
జూడగాంక్షించుటెడ యీజాడననుచు
దలపబోకుడు, మీరునాదండనుండ,
అనితాంతకఠోరదృశ్యావలోక
నమున, భీతిజెందకయె, యానందమునను,
శాత్రవానీకమారణసమయమందు
తోడుపడి మీకు పరులజెండాడుదాన,
ఘోరరణమందు శ్రమనొందకుండ తమకు
బాణతతినందజేయుచు బరిచరింతు
విజయలక్ష్మిని జేపట్టువేళనరసి
దివ్యహారతినిచ్చెద దేవదేవ!—"

—సత్యాదేవి.